క్లుప్తంగా

రాజేశ్‌కుమార్‌కు డాక్టరేట్



పర్వతగిరి: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మాడిశెట్టి రాజేష్‌కుమార్ డాక్టరేట్ పొందాడు. లండన్ వెబ్బిక్ యూనివర్సిటీ వారు సోషల్ సర్వీస్, మోటివేషనల్, ఆధ్యాత్మిక రంగంలో నిష్ణాతులైన వారికి గోల్డెన్ ఫ్యూచర్ సేవా ఫౌండేషన్ సంస్థ ద్వారా హానరరీ డాక్టరేట్, కింగ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గోల్డ్‌మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్‌కు సోషల్ సర్వీస్‌లో డాక్టరేట్ అందజేశారు. గ్రామస్తులు రాజేష్‌కుమార్‌ను అభినందించారు.

పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక



నర్సంపేట: పట్టణంలోని నెక్కొండ రోడ్డు కార్మెల్ ప్రార్థన మందిరంలో బుధవారం డివిజన్ షాలోమ్ పాస్టర్స్ పెలోషిప్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆదాంబెన్నీ, ఉపాధ్యక్షులుగా ఎం.లాజరస్‌గౌడ్, ఇ.సహోదర్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.క్రాంతి పాల్, సహాయ కార్యదర్శి జి.జాకోబుబెన్నీ, కె.షాలెమ్‌రాజు, కోశాధికారి సీహెచ్.జాన్‌స్వామి, ఉప కోశాధికారి డి.జాన్సన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, అధికార డివిజన్ ప్రతినిధులు ఎంఎస్.ప్రభాకర్, జి.ఇసాక్, అశోక్‌లు ఎన్నికయ్యారు. చైర్మన్ సీహెచ్.జాకోబ్, గౌరవ అధ్యక్షుడు జార్జి, పాస్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి



చెన్నారావుపేట: ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డీఎల్‌పీఓ, ఎన్నికల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని హత్యతండా, ధర్మ తండా, అక్కల్‌చెడ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను బుధవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమాలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు శ్రీకారం



వర్ధన్నపేట: పట్టణంలో ఎన్నికల కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు. బుధవారం మునిసిపాలిటీలో ప్రభుత్వ గోడలు, స్థలాల్లో ఉన్న ఆయా పార్టీల ప్రచారల గోడల రాతలను మునిసిపల్ సిబ్బంది తుడిచి వేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జోనా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులపై ఆయా పార్టీల ప్రచారాలు లేదా బ్యానర్లు, లేదా పార్టీల జెండాలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఒక వేళ ఏర్పాటు చేసిన వాటిని తొలగించడం జరుగుతుందని వివరించారు.

'జనసేన'ను ఆదరించాలి



చెన్నారావుపేట: జనసేన పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెరుగు శివకోటి యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జనంతో జనసేన–ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల అరుణ్‌కుమార్, వంగ మధు, ఓర్సు రాజేందర్, కుండె రాజ్‌కుమార్, సాయి ఈశ్వర్, ఎలబోయిన డేవిడ్, బొబ్బ పృథ్వీరాజ్, కిరణ్, అభిషేక్, రాఖేష్, తదితరులు ఉన్నారు.

మూడు టిప్పర్ల పట్టివేత

శాయంపేట : అనుమతులు లేకుండా మొరం, కంకర తరలిస్తున్న మూడు టిప్పర్ వాహనాలను పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివారలు ప్రకారం. మండలంలోని మాందారిపేట ప్రధాన రహదారిపై బుధవారం వే బిల్లులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు, కంకర తరలిస్తున్న ఒక టిప్పర్ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీటిని మైనింగ్ శాఖకు అప్పగిస్తామని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని హరిప్రసాద్ వెల్లడించారు.

నర్సంపేటలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నర్సంపేట : దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు



ఖానాపురం : ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



చెన్నారావుపేటలో..



పర్వతగిరిలో..

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని చిన్నగురజాలకు చెందిన 10 కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఖానాపురం మండలం మనుబోతులగడ్డ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బొంత కుమార్, యూత్ కార్యదర్శి వల్లెపు కుమార్, నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన పలువురు దొంతి మాధవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. దుగ్గొండి మండలం తిమ్మంపేట బీఆర్ఎస్‌కు చెందిన 10 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి దొంతి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా తిరుమలచౌహాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో బుధవారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల కు వివరించారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, 13వ వార్డు ఇన్‌చార్జి శ్రీరామోజు మురళి, దేశిసాయి పటేల్, కొల్లూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ముందుకు రావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు ధర్మరావుపేటలో కాంగ్రెస్ నాయకులు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు వెంకటప్రసాదరావు, ముస్తఫా, శ్రీను, సాంబయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: ప్రజలకు మేలైన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలనలోనే అమలవుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా గోపాల్‌నాయక్, పుల్లయ్యబోడు తండా గ్రామ అధ్యక్షులు ఈర్య, క్లస్టర్ బాధ్యులు మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, మాజీ ఎంపీటీసీ బిల్లా ఇంద్రసేనారెడ్డిలు అన్నారు. మండలంలోని పుల్లయ్యబోడు తండాలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తుందని వివరించారు. జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, యాకయ్య, రమేష్, అమీరొద్దీన్, భాస్కర్, మోహన్ నాయక్, హరీష్, రూపిక శ్రావణ్ పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లిలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, పార్టీ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అభినందన సభను విజయవంతం చేయాలి



దుగ్గొండి: మాట్లాడుతున్న రాజ్‌కుమార్

నర్సంపేట/దుగ్గొండి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి అభినందన సభను ఈనెల 13న విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ డివిజన్ అధ్యక్షుడు జినుకల కొమ్మాలు,ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఎన్నారై సెల్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. పిలుపునిచ్చారు. బుధవారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ నర్సంపేటలో మాధన్నపేట రోడ్డు ముదిరాజ్ సంఘం స్థలం పెద్దమ్మగుడి ప్రాంగణంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని మండలాల ముదిరాజ్ కుల మండల అధ్యక్షులు, సొసైటీ మహిళా కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నారావుపేట అధ్యక్షుడు హంస విజయరామరాజు, డివిజన్ నాయకులు ఈర్ల నర్సింహరాములు, గోనెల నరహరి, కిరణ్, శ్రీనివాస్, మహేందర్, రవి, స్వామి, వేణు, మునేందర్, భిక్షపతి, రమేష్, స్వామి, మహేందర్, మంద భిక్షపతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాగ్యానాయక్ చౌహాన్ సేవలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌నాయక్

నెక్కొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బంజార (లంబాడ), ఎరుకల, యానాదిలు ఆంధ్రప్రాంతంలో ఎస్టీలుగా, తెలంగాణ ప్రాంతంలో బీసీలుగా పరిగణించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, తెలంగాణలో ఎస్టీ జాబితాలోకి మార్చేంత వరకు ఉద్యమం చేసిన లావుడ్యా వాగ్యానాయక్ చౌహాన్ సేవలను గుర్తించాలని ఎంపీపీ జాటోతు రమేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే రాష్ట్రంలో ఒకే కులాలకు చెందిన వారందరికి వేర్వేరు రిజర్వేషన్లు వర్తింపచేయడంతో తెలంగాణలో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటు గురవుతున్నారన్న విషయాన్ని చౌహాన్ గుర్తించారని గుర్తు చేశారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తెలంగాణలో 6 శాతం ఎస్టీ రిజర్వేషన్ వాగ్యానాయక్ చౌహాన్ సాధించారన్నారు. రాష్ట్ర బంజార భవన్ ముందు, ప్రతి జిల్లా కేంద్రంలో వాగ్యానాయక్ చౌహాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చౌహాన్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు లావుడ్యా హరికిషన్, పూర్ణ, రవి, వాగ్యానాయక్, రవి నాయక్, లింగ్యానాయక్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దళిత న్యాయవాదికి ఘన నివాళి



యాది సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నర్సంపేట : దళిత న్యాయవాది కల్లెపల్లి సుధాకర్ యాది సభ బుధవారం సామాజికవేత్త చిలువేరు శ్రీనివాస్ అధ్యక్షతన పట్టణంలోని గాంధీచౌక్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత ప్రజాసంఘాల జేఏసీ ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బైరిపాక జయాకర్, నర్సంపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొమ్ము రమేష్‌యాదవ్ మాట్లాడుతూ సుధాకర్ మృతి తీరని లోటు అన్నారు. నర్సంపేట బార్ అసోసియేషన్ నుంచి రూ.1.50, వరంగల్ బార్ కౌన్సిల్ రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కార్యక్రమంలో వరంగల్ న్యాయవాది బార్ కౌన్సిల్ మెంబర్లు శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ టీఆర్.సాల్మన్‌రాజ్, ఆనంద్‌కుమార్, సురేందర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నర్సంపేట బార్ కౌన్సిల్ మెంబర్లు సారంగపాణి, నర్సింహారెడ్డి, లక్ష్మినారాయణ, రహీమొద్దీన్, సంజయ్, రవి, సాంబయ్య, సునీత, రాజు, పూర్ణచందర్, దిలీప్, సురేష్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

అరూరి గెలుపునకు కృషి చేయాలి

పర్వతగిరి : వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆరూరి మూడోసారి గెలవాలని హనుమాన్ దేవాలయం, బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉపసర్పంచ్ రంగు జనార్దన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ రంగు కుమార్ రజిత, రైతుబంధు కన్వీనర్ జూలపల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



వర్ధన్నపేట : తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, తాము ఎలా బతుకు సాగించాలని ఆవేదన చెందుతూ బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని తాము ఇబ్బందులకు అప్పులు తీసుకొచ్చి బతుకు వెళ్లదీస్తున్నామని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా తమకు వేతనాలు అందించి ఆదుకోవాలని వారు కోరారు.

బాలికలు ఏకాగ్రతతో చదవాలి



బాలికా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నర్సంపేట: బాలికలు ఏకాగ్రతతో చదివి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్ అన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్, ప్రీ స్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ బాలికలకు చదువు అత్యంత అవసరమన్నారు. తన కుటుంబ రూపు రేఖలను మార్చగల సత్తా కేవలం మహిళలకే ఉందన్నారు. డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో బాలికలు కిశోరావస్థలోని మార్పులను గ్రహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రకాశ్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నాజియా ఇక్బాల్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీంసుల్తానా, హారిక, జాఫర్, ప్రశాంత్‌కుమార్, పూజ, సమత, రవళి, రమాదేవి, దివ్య, సరితారాణి, మాధవి, రాధిక, అఖిల, సౌజన్య, అనిత, తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై కేవీపీఎస్ పోరాటం



కేవీపీఎస్ జెండా ఆవిష్కరించిన నాయకులు

పర్వతగిరి : సమాజంలో సామాజిక అసమానతలపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) నిరంతరం పోరాటం చేస్తుందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పొడేటి దయాకర్ అన్నారు. మండల కేంద్రంలో కేవీపీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల వివక్ష దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు, కుల దురహంకార హత్యలు ఏదో ఒక మూల ప్రతి రోజు దర్శన మిస్తున్నాయన్నారు. విద్య, వైద్యం, ఉపాధి దళితులకు అందని ద్రాక్షలా మారిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మాదాసి యాకోబు, సురేష్, పాల్గొన్నారు.

'నోటుకు ఓటు'కు స్వస్తి పలుకుదాం



మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

దుగ్గొండి: భూర్జువా పార్టీలు నోటుకు ఓటు కార్యక్రమానికి తెరలేపి అధికారం చేజిక్కించుకుని దోపిడీకి పాల్పడుతున్నారని నీతి, నిజాయితీకి ఓటు వేసి ఓటర్లంతా చైతన్యం కావాలని ఎంసీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి, నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారపు రమేష్ అన్నారు. మండలంలోని అడవిరంగాపురంలో పార్టీ కార్యకర్తల సమావేశం బుడిమె సురేందర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు, సీట్ల కోసం అధికారం సంపాదించుకోవడానికి హామీలతో మభ్యపెట్టి ఓట్లను నోట్లతో కొనడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొంరయ్య, మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, కిరణ్‌కుమార్, బుడిమె సాంబయ్య, గాంధీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ప్రజాసంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కేపీ రాజు



రాజుకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న నాయిని భరత్

గీసుకొండ : తెలంగాణ బీసీ ప్రజాసంఘం పరకాల నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలానికి చెందిన కమలాపురం రాజును నియమిస్తూ బుధవారం తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఉత్తర్వులు అందజేశాడు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మహిళా ఇన్‌చార్జ్ పద్మజాదేవి, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంటి స్వప్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేష్, నాయకులు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ చైర్మన్‌కు సన్మానం



చెన్నారావుపేట: నర్సంపేట మార్కెట్ కమిటీ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎన్నికైన చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డిని డైరెక్టర్లు బుధవారం సంఘ ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుండె మల్లయ్య, వైస్ చైర్మన్ చింతకింది వంశీ, డైరెక్టర్లు జంగిలి రాజు, మజ్జిగ రాంబాబు, ఇస్లావత్ గోపి, బానోతు పూల్‌శంకర్, ఎడ్ల మంజుల నారాయణరెడ్డి, మంచాల సరిత వెంకటేశ్వర్లు, సీఈవో చిట్టి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలివ్వాలి

శాయంపేట : జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాటాడుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ప్రతీ మండలంలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మిగతా మండలాల్లో పనిచేస్తున్న వారిని చిన్నచూపు చూడడం సరికాదన్నారు.

చేపలు పట్టే కాంట్రాక్టు విధానం వద్దు



చలివాగు ప్రాజెక్టుపై ఆందోళన చేస్తున్న మత్స్యకార్మికులు

శాయంపేట : మత్స్యకారులంతా ఏకమై కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయించి మత్స్యకారులే చేపలు పట్టే విధంగా సొసైటీ ఏర్పాటు చేకున్నామని, కానీ నూతనంగా ఎన్నికైన చలివాగు ప్రాజెక్టు చైర్మన్ గండి రాజమౌళి కాంట్రాక్ట్ విధానానికి తెరలేపుతూ మత్స్యకారులను మోసం చేస్తున్నాడని మత్స్యకారులు ఆరోపించారు. మండలంలోని చలివాగు బ్రిడ్జిపై బుధవారం మత్స్యకార్మికులు పల్లెబోయిన భాస్కర్, కర్ణాకర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ విధానానికి స్వస్తి పలికి మత్స్యకారులే చేపలు పట్టే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తుంటే చైర్మన్ రాజమౌళి మాత్రం చెరువులో పడవలు దింపి వలలు తీస్తేస్తానని చెప్పడం సరికాదన్నారు. కాంట్రాక్టు విధానానికి నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించిన మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహేందర్, కుమారస్వామి, పైడి, మల్లేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి: యాకూబ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోపాల్‌రావు



పర్వతగిరి: బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

రాయపర్తి: మండల కేంద్రానికి చెందిన ఐత యాకూబ్ గతంలో ఆర్మీలో సైనికుడిగా పని చేసి మధ్యలోనే తిరిగి ఇంటికి వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుండెపోటులో మృతిచెందాడు. బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు సందర్శించి మృతుడి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మండలంలోని మైలారంలో కొమ్ము వెంకటయ్య, శివరామపురం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భూక్య జగన్ తండ్రి భూక్య చత్రునాయక్ మృతిచెందగా వారి కుటుంబాలను గోపాల్‌రావు పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, కాంచనపల్లి వనజారాణి, సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, బందెల బాలరాజు, గబ్బెట బాబు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, మచ్చ సత్యం, జాజునాయక్ ఉన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నీరటి ప్రశాంత్ తాత ఇస్తారి ఇటీవల మృతి చెందగా బుధవారం దశదిన కర్మ ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల లోకేష్, మెరుగు అభిలాష్, అఖిల్, రంజిత్, పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన బానోతు శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే శ్రీనివాస్ తండ్రి హరిచంద్ పరిస్థితి విషమంగా ఉండడంతో బాల్యమిత్రులు బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. 2005–06 సంవత్సరంలో శ్రీనివాస్‌తో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న బాల్యమిత్రులు ఆర్థికసాయం అందజేశారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పడిన గుంతలను పూడ్చుతున్న పోలీసులు

రాయపర్తి: ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై పడిన గుంతలను ప్రమాదాలు జరగకముందే కంకర(కాంక్రీట్)తో సిబ్బందితో పూడ్చామని తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ జాతీయ రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు నడుస్తున్నాయని ప్రమాదాలు చోటు చేసుకోకుండా స్టేషన్ పరిధిలోని గుంతలను పూడ్చినట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులు ఎస్సైని అభినందించుకుంటూ వెళ్లారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట రూరల్ : నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం సోషల్ మీడియాలో బుధవారం కలకలం రేపుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మేడబోయిన రాజు అంగడిసెంటర్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఓ మహిళకు డబ్బులు అప్పుగా ఇచ్చా డు. అయితే డబ్బులు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసి పురుగుల మందు సేవించాడు. ప్రస్తుతం వరంగల్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనిపై ఎస్సై శీలం రవిని వివరణ కోరగా రాజు ఓ మహిళకు అప్పు ఇచ్చినట్లుగా కాగితం ఉందని పోలీస్‌స్టేషన్‌కు రాగా అప్పు తీసుకున్న వారిని పిలిపించి మాట్లాడగా కోర్టులోనే చూసుకుంటామని వారు తేల్చి చెప్పడంతో ఇరువర్గాలను కోర్టుకు వెళ్లాల్సిందిగా సూచించామన్నారు. రాజు పురుగుల మందు సేవించిన విషయం మా దృష్టికి రాలేదని, ఎవరు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్సై చెప్పారు.